
అక్రమ నిర్మాణానికి వత్తాసు

- బాధితులకు కాకుండా వ్యతిరేక వర్గానికి సహకరిస్తున్న కార్పొరేటర్
- న్యాయం కోసం 'సాక్షి'ని ఆశ్రయించిన బాధిత కుటుంబం


ఈ నెల 6న అందజేసిన 3వ నోటీస్

దాబాగార్డెన్స్: 'అధికారులే నాకు ఫోన్ చేశారు. మీ వార్డు నుంచి ప్రజా పరిష్కార వేదికలో ఫిర్యాదు అందింది. కమిషనరే కాదు. మీరు ఎక్కడికెళ్లినా మీ సమస్య పరిష్కారం కాదు. మీరు నా దగ్గరకు రండి. నన్ను కాదని మీరు ఎక్కడికెళ్లినా వారు తిరిగి నాకే ఫోన్ చేస్తారు. నన్ను కలవకపోతే ఎట్టి పరిస్థితిలోనూ మీ పని జరగదు..' ఈ మాటలు అన్నది ఎవరో కాదు.. ఓ ప్రజాప్రతినిధి. కళ్లెదుటే సమస్య కనిపిస్తున్నా.. సమస్యను తీర్చక పోగా.. ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి వ్యతిరేకంగా ఆ ప్రజా ప్రతినిధి అన్యాయానికి దిగుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం ప్రజా పరిష్కార వేదికను ఏర్పాటు చేశారు. అక్కడ న్యాయం జరుగుతుందని వెళ్లిన ఫిర్యాదీదారులకు అధికారులు.. ప్రజాప్రతినిధులు ఏకమై సమస్యను పరిష్కరించకపోగా.. రాజీ పడిపోండనో.. లేదా మీ కార్పొరేటర్‌ను కలవండని ఫిర్యాదీదారుల వ్యతిరేక వర్గానికి వత్తాసు పలకడం విశేషం. ఇంతకీ ఆ కార్పొరేటర్ ఎవరంటే.. దక్షిణ నియోజకవర్గం 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్. అక్కడ కట్ చేస్తే.. జీవీఎంసీ 39వ వార్డు పరిధి కోటవీధి డోరు నంబరు 24-27-47లో ఏ, బీ రెండు పోర్షన్లు ఉన్నాయి. షేక్ జోహార్ ఇంటి పక్క పోర్షన్‌లో అన్సార్ ఆలీ ఉన్నారు. షేక్ జోహార్ అన్నదమ్ములు దివ్యాంగులు. వీరంతా ఒక పోర్షన్‌లో ఉంటున్నారు. గ్రౌండ్ + మొదటి అంతస్థులో వీరుండగా.. పక్క పోర్షన్‌లో ఉంటున్న అన్సార్ ఆలీ ఇటీవల తన ఇంటి నిర్మాణం చేపటారు. అక్కడి వరకు బాగానే ఉంది.


ఇలా హద్దులు మీరి నిర్మాణాలు చేపట్టినా స్పందించని జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం

ఇక్కడి నుంచే కథ మొదలు..

అన్సార్ ఆలీ (కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ వర్గం) జీ+త్రీ తరహాలో తన ఇంటి నిర్మాణం చేపట్టారు. నిర్మాణంలో పక్క పోర్షన్‌లో ఉంటున్న షేక్‌జోహార్ ఇంటిపైకి తన నిర్మాణాలు చేపట్టడంతో షేక్‌జోహార్ అన్నదమ్ములు గత నెల 17న జోన్-4 జోనల్ కమిషనర్ ప్రసాదరావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన జోనల్ కమిషనర్ టౌన్‌ప్లానింగ్ ద్వారా గత నెల 20న ఫస్ట్ నోటీస్ పంపారు. అయినప్పటికీ అన్సార్ ఆలీ నిర్మాణాలు ఆపలేదు. షేక్‌జోహార్ అన్నదమ్ములందరూ ఈ నెల 1న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను ప్రజా పరిష్కార వేదికలో కలిసి మొర పెట్టుకున్నారు. కమిషనర్ స్పందించి టౌన్ ప్లానింగ్ ద్వారా రెండో నోటీస్ పంపారు. అప్పటికే నిర్మాణాలు జరిగిపోయాయి. ఈ నెల 6న మూడో నోటీస్ కూడా పంపారు. అన్సార్ ఆలీ నుంచి ఎటువంటి సమాధానం రాకపోగా.. అతనికి కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ అండదండలు ఉండడంతో షేక్‌జోహార్ అన్నదమ్ములు తమ సమస్య ఎవరికి చెప్పుకోవాలో తెలియక సాక్షిని ఆశ్రయించారు. కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ వద్దకు వెళ్లి మొర పెట్టుకుంటే.. న్యాయం చేయాల్సింది పోయి అన్సార్ ఆలీకి మద్దతుగా నిలవడమే కాక.. జీవీఎంసీ అధికారులు కూడా కార్పొరేటర్‌కు.. అన్సార్ ఆలీకి వత్తాసు పలుకుతున్నారని బాధితులు వాపోతున్నారు.

న్యాయం చేయాల్సిన వారే..

ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే ప్రజా ప్రతినిధి.. అధికారులు ఒక్కటై రెండు ఇళ్ల మధ్య జరుగుతున్న సమస్యకు పరిష్కారం చూపకపోగా.. కార్పొరేటర్ అనుయాయులకు వత్తాసు పలకడంపై పలువురు విమర్శిస్తున్నారు. హద్దులు మీరి నిర్మాణాలు చేపడుతున్నా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోపోవటంపై పలువురు మండిపడుతున్నారు. నిర్మాణం చేపట్టక ముందే అధికారులు నోటీసు అందజేయాలని చెప్పినప్పటికీ సచివాలయ టౌన్‌ప్లానింగ్ సెక్రటరీ సంతోష్ నోటీసులు ఆలస్యంగా ఇవ్వడమే కాక.. ఫిర్యాదీదారులపై విరుచుకుపడుతున్నారని బాధితులు తెలిపారు.


ఈ నెల 1న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మకు మొర పెట్టుకుంటున్న బాధితులు (ఫైల్)


కమిషనర్‌కు ఫిర్యాదు తర్వాత నిర్మాణాలను పరిశీలిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

సమస్య ఎమ్మెల్యే దృష్టికి

ఇటు కార్పొరేటర్, అటు జీవీఎంసీ అధికారుల వల్ల న్యాయం జరగకపోవడంతో ఆ దివ్యాంగులు (మరుగుజ్జులు) ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి వన్‌టౌన్ పోలీసులకు ఫోన్ చేసి ఎటువైపు న్యాయం ఉందో వారికి సహాయం చేయాలని సూచించారు.

మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని వినతి


ఆస్పత్రుల సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న సీహెచ్ నరసింగరావు

దాబాగార్డెన్స్: విశాఖలోని ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో మెరుగైన వైద్య సేవలు కల్పించాలని కోరుతూ బుధవారం ఇన్‌స్పెక్షన్‌కు వచ్చిన కామన్ సపోర్ట్ మిషన్ టీమ్ చైర్మన్ డాక్టర్ కామత్‌సింగ్, డాక్టర్ అజిత్‌కు సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసరావు, ఆర్‌టీ రాజు బృందం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ ఈఎస్ఐ బోర్డులో కార్మికుల డబ్బులు లక్షల కోట్లు ఉన్నా, సౌకర్యాలు కల్పించడంలో బోర్డు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఆపరేషన్ థియేటర్, ల్యాబ్‌లో రక్త పరీక్షలు గానీ, సామగ్రి గాని అందుబాటులో లేవన్నారు. తక్షణమే ఈఎస్ఐ పేషెంట్లకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే రిఫరల్ హాస్పటల్స్ సంఖ్య, బెడ్స్ సంఖ్య, అవసరమైన డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది సంఖ్య పెంచాలన్నారు. షీలానగర్ వద్ద గల ఈఎస్ఐ హాస్పటల్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, బర్న్స్ వార్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులకు మెరుగైన వైద్య సేవలు కల్పించకపోతే భవిష్యత్‌లో పెద్ద ఎత్తున కార్మికులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. దీనికి స్పందించిన కామన్ సపోర్ట్ మిషన్ టీమ్ చైర్మన్ డాక్టర్ కామత్‌సింగ్ విజయవాడలో ప్రిన్సిపల్ సెక్రటరీతో చర్చించి అవసరమైన చర్యలు చేపడతామని చెప్పినట్టు నరసింగరావు తెలిపారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

కంచరపాలెం: జోన్-2 డివిజన్ కంచరపాలెం సెక్షన్ పరిధి సబ్‌స్టేషన్‌లో 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 12 శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కాన్వెంట్ జంక్షన్, జ్ఞానాపురం, పైడిమాంబ కాలనీ, ఎఫ్‌సీఐ ఫుడ్ గొడౌన్స్, కోరమాండల్ గేటు తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సర ఫరా ఉండదని, ఆయా ప్రాంతాల ప్రజలు గమనించి సహకరించాలి కోరారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

దాబాగార్డెన్స్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ కె. నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆశీల్‌మెట్ట శ్రీచైతన్య పాఠశాలలో బుధవారం స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ ఇండియా మిషన్ పేరిట పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలుష్యం పెరగకుండా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విధిగా తమ ఇంట మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించాలని అభిలషించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తీసుకొచ్చిన మొక్కలు పాఠశాల ప్రాంగణంలో నాటారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను శ్రీచైతన్య పాఠశాలల ఉత్తరాంధ్ర ఏజీఎం ఎంవీ సురేష్, విశాఖ రీజనల్ ఇన్‌చార్జి మహ్మద్ ఆలీ, జోనల్ కోఆర్డినేటర్ ఎల్. రాజేష్, అసిస్టెంట్ జోనల్ కోఆర్డినేటర్ కిరణ్‌రెడ్డి అభినందించారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ. 21.3 లక్షలు


హుండీ లెక్కిస్తున్న సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు

కంచరపాలెం: జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం దేవాదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకుల సంయుక్త ఆధ్వర్యంలో అమ్మవారి హుండీలు లెక్కించారు. 50 రోజులకు గాను అమ్మవారి ముడుపులు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ. 21,03,182 వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. సహాయ కమిషనర్, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి. వసంతకుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఏపీజీవీ బ్యాంక్, కంచరపాలెం పోలీస్ సిబ్బంది, కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీవారి స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్ట్

గోపాలపట్నం: ఒడిశా ఏజెన్సీ ప్రాంతం నుంచి వస్తున్న ముగ్గురు వ్యక్తుల నుంచి 1.5 కిలోల గంజాయి, 3 కిలోల లిక్విడ్ గంజాయిని టాస్క్ ఫోర్స్ పోలీసులు, గోపాలపట్నం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పాడేరు రూరల్ ఒడిశా బోర్డర్ నుంచి కేజిన్నర గంజాయి, 3 కిలోల లిక్విడ్ గంజాయిని ఎన్ఏడీ కాకానినగర్‌కు చెందిన రామ్ ప్రసాద్, విజయనగరానికి చెందిన భరత్ శ్యామ్‌సుందర్, మరో మైనర్ తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో విమాన్‌నగర్ నుంచి యల్లపువానిపాలెం ఎస్సీ కాలనీ రోడ్డులో వలవేసి పట్టుకున్నారు. వారి నుంచి గంజాయి, లిక్విడ్ గంజాయితో పాటు 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు పంపించారు.

క్యాన్సర్ స్క్రీనింగ్‌పై ముగిసిన శిక్షణ


శిక్షణ పూర్తి చేసుకున్న వారితో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: క్యాన్సర్ స్క్రీనింగ్‌పై నెల రోజుల నుంచి జరుగుతున్న శిక్షణ నేటితో ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో చేపట్టనున్న క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం కోసం సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇస్తున్న సంగతి విదితమే. అందులో భాగంగా హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ పర్యవేక్షణలో గత నెల 13వ తేదీ నుంచి శిక్షణ ఇచ్చారు. జిల్లాలో ఉన్న మెడికల్ కాలేజీ వైద్య నిపుణులు (సామాజిక వైద్య శాస్త్ర అధ్యాపకులు, గైనకాలజిస్ట్, డెంటల్ సర్జన్లు, రేడియాలజిస్ట్, సాధారణ సర్జన్లు, రేడియేషన్ అంకాలజిస్టులు, సర్జికల్ అంకాలజిస్టులు) శిక్షణ ఇచ్చారు. జిల్లాలో ఉన్న అన్ని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో గల గైనకాలజిస్ట్, డెంటల్ సర్జన్లు, జిల్లా టీం వారు శిక్షణ తీసుకున్నారు. జిల్లాలో ఉన్న 91 మంది వైద్యులు, 9 మంది స్టాఫ్ నర్సులు, 54 మంది సీహెచ్‌వో, 498 మంది ఏఎన్ఎంలకు బ్యాచ్‌ల వారీగా రోజుకు 40 మంది చొప్పున ఆంధ్ర వైద్య కళాశాలలో శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు ఆధ్వర్యంలో జిల్లా ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్ నోడల్ అధికారి డాక్టర్ కె. సాయిసుష్మ, సామాజిక వైద్య విభాగాధిపతి డాక్టర్ ఎ. కృష్ణవేణి, ప్రముఖ అంకాలజిస్టు డాక్టర్ శిల్ప తదితరుల ఆధ్వర్యంలో ఈశిక్షణ కార్యక్రమం జరిగింది.

సెంట్రల్ పార్క్‌ను సందర్శించిన వీఎంఆర్‌డీఏ కమిషనర్


సెంట్రల్ పార్కును సందర్శిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ రవీంద్ర

మహారాణిపేట: వీఎంఆర్‌డీఏ కమిషనర్ రవీంద్ర బుధవారం సెంట్రల్ పార్క్‌ను సందర్శించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా పాడైన చిల్డ్రన్ ప్లే పరికరాలు, సైన్ బోర్డ్‌లను సాధ్యమైనంత త్వరగా బాగు చేయించాలని అధికారులకు సూచించారు. అదే విధంగా వ్యర్థాల నిర్వహణ త్వరితగతిన చేపట్టాలని, నడక దారిలో పాడైన టైల్స్ స్థానంలో కొత్తవి వేయాలని తెలిపారు. ఈ పర్యటనలో సీఈ భవానీ శంకర్, ఎస్ఈ బలరామరాజు, ఈఈలు ఎస్‌వీఎస్ఎన్ రాజు, రామరాజు, రేంజ్ ఆఫీసర్ శ్యామల, డీఈ మురళీకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ బేగం తదితరులు పాల్గొన్నారు.

అరకు ఎంపీని సత్కరించిన పెన్షనర్లు


ఎంపీ డాక్టర్ తనూజారాణిని సత్కరిస్తున్న బీఎస్ఎన్ఎల్ పెన్షనర్లు

దాబాగార్డెన్స్: ఆలిండియా బీఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ విశాఖ శాఖ 5వ జిల్లా మహాసభ బుధవారం డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ గుమ్మ తనూజారాణి పాల్గొని మాట్లాడారు. బీఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు బాధ్యతగా పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పెన్షనర్లు ఆమెకు అందజేశారు. అనంతరం డాక్టర్ తనూజారాణిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పాల్ విలియమ్స్, పి. ఆడమ్స్, ఏఐబీడీపీఏ సర్కిల్ సెక్రటరీ కేఎస్‌సీ బోస్, డిస్ట్రిక్ట్ సెక్రటరీ కె. రామాంజనేయలు, సీజీపీఏ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు డెంగ్యూపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జగదాంబ: జీవీఎంసీ 34వ వార్డులో గల అచ్చియ్యమ్మపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం డెంగ్యూపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ కె.ఎస్.వి. కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. డెంగ్యూ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తుమన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు జి.సత్యనారాయణ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ పరిధిలో డీఆర్ఎం తనిఖీలు


శివలింగపురం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో కేకే లైన్ కొత్తవలస-శివలింగపురం మధ్య బుధవారం డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తనిఖీలు నిర్వహించారు. శివలింగపురం స్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ మార్గంలో జరుగుతున్న ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ పనులు, ట్రాక్ సర్క్యూట్స్, టన్నెల్స్, పాయింట్స్, క్రాసింగ్స్, బ్రిడ్జిల నిర్వహణ, ట్రాక్షన్ సబ్ స్టేషన్స్, వసతులు, భద్రతా ప్రమాణాలు, రక్షణ గోడలు వంటి ప్రతి పనిని క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షా కాలంలో బండ రాళ్ల ట్రాక్‌లపై పడేందుకు అవకాశమున్న ప్రాంతాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం స్టేషన్ మాస్టర్, సిబ్బందితో డీఆర్ఎం మాట్లాడారు. టన్నెల్స్, ఘాట్ సెక్షన్లలో ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్, సమాచార వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైళ్ల రాకపోకలు సాఫీగా సాగేందుకు అన్ని భద్రతా ప్రమాణాలను పాటించాలని, విధి నిర్వహణలో ఏ మాత్రం ఆదమరచి ఉండరాదని అధికారులకు, సిబ్బందికి సూచించారు. తనిఖీల్లో ఏడీఆర్ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి


టౌన్‌కొత్తరోడ్డు వద్ద చెత్త ఎత్తిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్


స్వీపింగ్ మిషన్ పనితీరును పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

జగదాంబ: పారిశుద్ధ్య కార్మికులు సమయపాలన పాటించాలని జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో రాజేష్ అన్నారు. బుధవారం ఆయన జోన్ పరిధిలోని 12 వార్డుల్లో పర్యటించారు. టౌన్ కొత్త రోడ్డులో సిబ్బందిచే చెత్త ఎత్తించారు. పారిశుద్ధ్య సిబ్బంది, క్లాప్ వాహనాల డ్రైవర్లతో మాట్లాడారు. సిబ్బంది తప్పకుండా ఎనిమిది గంటలు పని చేయాలన్నారు. చాలా మంది సిబ్బంది హాజరు వేయించుకుని పనుల్లో ఉండకుండా వెళ్లిపోతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అటువంటి వారిపై దృష్టి సారించామని త్వరలోనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్లాప్ వాహనాలు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలన్నారు. నిర్దేశించిన చెత్తను క్లాప్ వాహనాల్లో తీసుకు రావాలన్నారు. అలాగే ప్రతి వాహనానికి లాగ్ బుక్ ఉండాలన్నారు. వీటన్నింటినీ సెక్రటరీలు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

27న రాష్ట్రస్థాయి ఏఏఎఫ్ వర్క్‌షాప్


సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బైపా అరుణ్‌కుమార్ తదితరులు

అల్లిపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా ఫౌండేషన్ (ఏఏఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన కాకినాడ డి కన్వెన్షన్ హాల్లో 17వ రాష్ట్రస్థాయి ఎస్సీ, ఎస్టీ వర్క్‌షాప్ జరుగుతుందని ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్ బైపా అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం బీఏకే చాంబర్స్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వర్క్‌షాప్ బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌లో ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు, మేధావులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలకు గుర్తింపునివ్వాలి


రౌండ్ టేబుల్ సమావేశంలో ఉత్తరాంధ్ర ఆర్ఎంపీ అసోసియేషన్ ప్రతినిధులు

సీతమ్మధార : మారుమూల గ్రామీణ ప్రాంతాలు, ఏజెన్సీ ఏరియాల్లో ఎందరికో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తూ జీవిస్తున్న గ్రామీణ వైద్యులు ఎందరో ఉన్నారని ఉత్తరాంధ్ర ఆర్ఎంపీ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి అన్నారు. డైమండ్ పార్కు వద్ద ఒక హోటల్‌లో బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ వైద్యులకు గతంలో 429 జీవో 2008లో ఇచ్చారని, తరువాత కాలంలో ఆర్ఎంపీ వైద్యుల వ్యవస్థను ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఉత్తరాంధ్రలోనే ఈ తరహా గ్రామీణ వైద్యులు సుమారు 9 వేల మంది ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలు, పట్టణాల్లో 40 వేల మంది ప్రాథమిక వైద్యులు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆర్ఎంపీ, పీఎంపీలను పట్టించుకోవాలని, ఎవరి మీద ఆధార పడకుండా వారికున్న అనుభవంతో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జోనల్ కార్యదర్శి ఎస్.సుగుణేశ్వరి, కారుణ్య క్యాన్సర్ ఫౌండేషన్ కార్యదర్శి, సంఘం సభ్యులు, సలహాదారులు కోన ప్రకాష్, కల్యాణి, జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, లోగిశ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జూ, విమ్స్ కార్మికుల నిరసన

- కనీస వేతనాలు చెల్లించాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో డిమాండ్స్ డే


జూ గేటు వద్ద కార్మికులతో కలిసి నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ఆరిలోవ: డిమాండ్స్ డే సందర్భంగా జూ పార్కు, విమ్స్‌లో పని చేస్తున్న కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ దేశ వ్యాప్తంగా బుధవారం డిమాండ్స్ డే నిర్వహించింది. ఇందులో భాగంగా జూ పార్కు వద్ద సీఐటీయూ జూ కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కమార్ మాట్లాడుతూ సుమారు 15 సంవత్సరాల నుంచి జూలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడంలేదన్నారు. కనీసం రూ.26 వేలకు తక్కువ కాకుండా వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మూడోసారి మోదీ ప్రభుత్వం వచ్చినా కార్మిక వ్యతిరేక విధానాలలో మార్పు రాలేదన్నారు. కార్మికులకు నష్టం చేసేలా, యాజమాన్యాలకు లాభం చేకూరినట్లు విధానాలు అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్పు చేసి యజమానులకు కార్మికులను బానిసలుగా చేసేలా చర్యలు చేపడుతున్నారన్నారు. భవిష్యత్‌లో కార్మికుల సమస్యలపై ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నరేంద్ర కుమార్, జూ కార్మిక యూనియన్ నాయకులు నరేష్, పైడిరాజు, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

◆ విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో పని చేస్తున్న కార్మికులతో కలసి ప్రభుత్వ ఆస్పత్రుల కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మిక యూనియన్, ఆరిలోవ జోన్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం డిమాండ్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రుల కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ విమ్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వారికి ఈఎస్ఐ, పీఎఫ్ సక్రమంగా చెల్లించాలనాన్నారు. ఆరిలోవ జోన్ సీఐటీయూ నాయకులు కుమార్, విమ్స్ కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికుల నాయకులు రాజేశ్వరి, కనకరాజు, అన్నపూర్ణ, పార్వతమ్మ పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు బుధవారం వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఏఎన్ఎం కృష్ణవేణి ఆధ్వర్యంలో ఆశా వర్కర్ భవాని సహకారంతో పుట్టిన బిడ్డలతోపాటు 16 ఏళ్ల వరకు టీకాలు వేశారు. బిడ్డ పుట్టిన 24 గంటల్లోపు బీసీజీ(క్షయ నివారణ), ఓపీవీ, హెపటైటిస్-బీ(కాలేయ వ్యాధుల నివారణ), ఓపీవీ(పోలియో నివారణ) వ్యాక్సినేషన్ చేశారు. ఆరు వారాలుకు ఓపీవీ-1, పది వారాలకు ఓపీవీ-2, 14 వారాలకు ఓపీవీ-3, 9 నెలలకు మీజిల్స్ రూబెల్లా-1 వేస్తున్నట్లు ఏఎన్ఎం కృష్ణవేణి తెలిపారు. అనంతరం పిల్లల తల్లులకు పలు సూచనలిచ్చారు. పిల్లలకు టీకాలు వేయించకపోతే వెంటనే వేయించుకోవాలన్నారు.

'గైస్'లో కోర్సుల నిర్వహణ పరిశీలన

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(గైస్) నిర్వహణను బుధవారం కాలేజీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు పరిశీలించారు. ఈ కాలేజీలో రెండు కోర్సులకు ఎన్‌బీఏ గుర్తింపు లభించినందున వాటి నిర్వహణ తీరుపై డైరెక్టర్ల బృందం సమీక్ష నిర్వహించింది. ప్రొఫెసర్ వీఎస్ఆర్‌కే ప్రసాద్, ప్రొఫెసర్ డీఏ నాయుడు, ప్రొఫెసర్ వి.పద్మశ్రీ, డాక్టర్ వోఎం రావ్, కేవీకే సుబ్బరాజు, అరుణలతో కూడిన బృందం కాలేజీలోని ప్రయోగశాలల నిర్వహణ, వాటిని విద్యార్థులు ఉపయోగించుకుంటున్న తీరు తదితర అంశాలు పరిశీలించింది.